
# దృక్కోణాలు

శివప్రసాద్



'సుహాసిని తనతో మాట్లాడుతుందా? కనీసం కన్నెత్తి తన వంక చూస్తుందా? మరి ఆమెకు తన గోడు వినిపించుకునే దెలా? మనసు విప్పి మాట్లాడే దెలా? ఆమె ఒక మిలియనీర్ కూతురు. చాలా గర్వం కల మనిషని, పొగరుబోతు మనిషని అందరూ అనుకోవటం కద్దు. ఆమె సాధారణంగా ఎవరితోనూ మాట్లాడక పోవడం. మాట్లాడినా దురుసుగా ప్రవర్తించటం-అలా అనుకోవటానికి కారణాలని చెప్పుకోవచ్చు. అటువంటి ఆమెతో సామాన్య జీవనానికికూడా నోచుకోని తను మాట్లాడితే కాలేజీలో వాళ్ళంతా ఏమనుకుంటారో! తీరా తను పలకరించాక ఆమె ఏమీ మాట్లాడకపోగా కసురుకుంటే వీళ్ళంతా తనని పరిహసించరూ? అసలే తను అభిమానం కల మనిషి. అటువంటి సంఘటనే కనక జరిగితే మరల తను కాలేజీలో తల ఎత్తుకుని తిరగగలడా? ఇప్పటికే సగం చచ్చి బతుకుతున్నాడు. కాని...కాని...తను అవకాశం చూసుకుని ఆమెతో మాట్లాడితీరాలి.'

** ** **

బస్సు దిగి ఆదరా బాదరా వస్తున్నాడు శ్రీనివాస్. అప్పటికే పది నిమిషాలు లేటు. 'క్లాసు జరుగుతూ ఉంటుంది.' అతనిలో ఆందోళన. క్రీమ్ కలర్ కారు దూసుకుపోయింది అతని పక్కనుంచి. అందులో సుహాసిని కనబడింది. 'ఈ రోజు ఈమెకూడా లేటన్న మాట!' అతని మెదడు చురుగ్గా పని చేయసాగింది. 'అందరూ క్లాస్‌రూమ్‌లోకి వెళ్ళిపోయి ఉంటారు. బయట ఎవ్వరూ ఉండరు. ఆమెతో మాట్లాడేందుకు, తన మనసులో కోరిక వెలిబుచ్చేందుకు ఇదే సరైన అదను!'

శ్రీనివాస పరుగు లంకించుకున్నాడు. అప్పటికే మూ డొంతులు అరిగిపోయిన కాలిచెప్పు తెగి అల్లంత దూరాన పడింది అతని పరుగు ధాటికి తట్టుకోలేక. అతని మనసు బిక్కచచ్చిపోయింది. శ్రీనివాస తెగిన చెప్పు చేత పుచ్చుకుని రిపేర్ చేయించుకోవటానికి వెళ్ళటం, సుహాసిని క్లాసరూమ్‌లోకి అడుగు పెట్టటం ఒకేసారి జరిగిపోయాయి.

** ** **

థియరీ క్లాసెస అయిపోయాయి. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన కారణంగా ఆ పూట ప్రాక్టికల్స్ రద్దు చేశారు. అది ఊహించని విషయం. 'సుహాసిని కారు ఎప్పటిలాగా నాలుగ్గంటలకి వస్తుంది.' ఇలా అనుకోకుండా ప్రాక్టికల్స్ లేనప్పుడల్లా సుహాసిని కారు వచ్చేంత వరకు మాగజైన్ సెక్షన్‌లో కూర్చుంటుంది. మిగతా స్టూడెంట్స్ సినిమాలకూ, ఇళ్ళకూ వెళ్ళిపోతారు. దగ్గర్లో పరీక్షలు లేవు కాబట్టి లైబ్రరీలో కూర్చునే ఓపికకూడా ఎవరికీ ఉండదు. తను సుహాసినితో మాట్లాడటం క్లాసమేట్స్ కంటబడే అవకాశం లేదనిపిస్తూంది. శ్రీనివాసకి ధైర్యం చిక్కుతోంది. అతనూహించినట్టుగానే ఆమె మాగజైన్ సెక్షన్‌కి దారి తీసింది. 'సుహాసిని కాలేజీ ఆవరణ నుంచి నిష్క్రమించడానికి మరో రెండు గంటల వ్యవధి ఉంది. ఓ గంట గడిస్తే అప్పటికి తన క్లాసమేట్స్ అంతా కాలేజీనుంచి వెళ్ళిపోతారు. ఆమెతో మాట్లాడడానికి ఎటువంటి ఆటంకమూ ఉండక పోవచ్చని భావించాడు శ్రీనివాస.

క్షణమొక యుగంలా గడుపుతూండగా ఓ గంట గడిచింది. ధైర్యం కూడదీసుకుని మాగజైన్ సెక్షన్‌కి దారి తీశాడు. సుహాసిని 'ఫెమినా' చదువుతూంది. ఆమెను చూడగానే అతని గుండె ఝల్లుమంది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస' తీసుకుంటుంటే చేతులు వణకసాగాయి. కుర్చీలో కూర్చుని నలువైపులా కలయజూశాడు. జూనియర్స్ ఎవరో ఉన్నారు. వాళ్ళకు తనతోకాని, తనకు వాళ్ళతో కాని పరిచయం లేదు. బిక్కు బిక్కుమంటూ మరల ఆమె వంక చూశాడు ఆశగా. ఆమె పుస్తకంలో మునిగిపోయినట్టుగా గోచరిస్తూంది. సమయం గడుస్తూందేతప్ప ఆమె అతని వంక చూడటం లేదు.

'సుహాసినితో మాట్లాడేదెలా? మనసు లోని మాట బయట పెట్టేదెలా?' పరిపరి విధాల ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. చేతుల్లో పేపరు ఉందన్న మాటే కాని, కళ్ళకు వాక్యాలు కనపడటం లేదు. పేపరు కొంచెం పక్కకు తొలగించి ఆమె వేపు చూసి చూడనట్లుగా చూశాడు. అతని గుండె మరో సారి ఝల్లుమంది. సుహాసిని పుస్తకం మూసి టేబుల్‌మీద పెట్టి వాచీ వంక చూసింది. సరిగ్గా అదే సమయంలో వాల్ క్లాక్ నాలుగు గంటలు కొట్టింది.

ఆమె కుర్చీలోంచి లేచింది. సుహాసిని తన ముందు నుంచి వెళ్ళిపోతూ ఉంటే నోట మాట రాక అచేతనంగా, నిస్సహాయంగా ఉండిపోయాడు శ్రీనివాస. 'ఊహుఁ! ఇలా అయితే లాభం లేదు. ఈ అవకాశం జారవిడుచుకో కూడదు.' అతను కృతనిశ్చయంతో లేచాడు కుర్చీలోంచి. ఆమె అడుగులో అడుగు వేస్తూ నడిచాడు. గేటు బయట క్రీమ్ కలర్ కారు ఆగి ఉంది. ఆ కారుకీ, సుహాసినికీ మధ్య ఇంక ఏభై గజాల దూరమే! అతనికీ, ఆమెకీ మధ్య కొన్ని అడుగుల దూరం! ఎవరో వస్తున్న అడుగుల సవ్వడి విని సుహాసిని వెనక్కి చూసింది. తమ చూపుల కలయిక శ్రీనివాస గుండె వేగాన్ని పెంచింది. అతని పాదాల్లో 'చచ్చు' ఆవహించుకునేట్టు చేసింది. ఆమెకీ, కారుకీ మధ్య దూరం తక్కువై పోయింది. శ్రీనివాసలో ఆత్రత, కంగారు. 'సుహాసినిగారూ!' పిలుద్దా మనుకున్నాడు. అతని పెదిమలు మాత్రమే కదిలాయి. శబ్దం బయటికి రాలేదు. కారణం? 'శ్రీనివాస!' అని ఎవరో వెనకనుంచి పిలవడం. ఉస్సురుమన్నాడు శ్రీనివాస. ఆగి వెనక్కి తిరిగి చూశాడు. తన క్లాసమేట్ శ్రీధర్! 'వీ డెక్కడనుంచి ఊడిపడ్డాడు ఈ సమయంలో? ఛ!' కసిగా తనలో తాను గొణుక్కో సాగాడు అతడు.

"ఏంత్రా? ఇప్పటిదాకా ఏం చేస్తున్నావ్?" అని శ్రీధర్ వెకిలిగా ప్రశ్నించడం, కారు కదిలి వెళ్ళిపోయిన శబ్దం వినిపించడం ఒకేసారి జరిగిపోయాయి.

** ** **

అదృష్టవశాత్తు ఆ రోజు సుహాసిని కారు రావడం ఎందుకో ఆలస్యమయింది. అంతా వెళ్ళిపోయారు. ఆమె మాత్రం లాన్‌లో కూచుని అసహనంగా ఎదురుచూస్తూ ఉంది. శ్రీనివాస ప్రపంచంలోని ధైర్యాన్నంతా అరువు తెచ్చుకున్నాడా సమయంలో. పాదాలు కదిలాయి. గుండె వేగంగా కొట్టుకొంటోంది. పెదాలు వణకుతున్నాయి. ముఖాన చెమట పేరుకోసాగింది. అడుగులు మాత్రం పడుతూనే ఉన్నాయి. ఇప్పుడు శ్రీనివాస సుహాసినికి అతి చేరువలో ఉన్నాడు. అంతలోనే క్రీమ్ కలర్ కారు వచ్చి ఆగింది. సుహాసిని లేచి కారువైపు నడిచింది.

"సుహాసినిగారూ!"

శ్రీనివాస ఈసారి నిజంగానే పిలిచాడు. సుహాసినికి అతని పిలుపు వినపడింది. కారులో కూర్చోబోయిందల్లా ఆగింది. వెనుదిరిగి "ఏమిటి సంగతి?" అన్నట్టుగా చూసింది.

అతని ముఖం నిండా చెమట. ఆమెకు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"సు...హా... సి...నిగారూ! మీతో...మాట్లా...డాలి!" అన్నాడు తడబడుతూన్న పెదిమలని అదుపులోకి తీసుకుంటూ.

"మిస్టర్ శ్రీనివాస! జాగ్రత్తగా ఉండు. కొన్ని రోజుల నుండి చూస్తున్నాను. నా వెంట పడుతున్నావు. నీ వేదో మెరిటోరియస స్టూడెంట్ అయినంతమాత్రాన అదో పెద్ద అర్హతగా భావించి నాతో సాన్నిహిత్యం పెంచుకోవాలని ఆరాటపడటం కేవలం నీ మూర్ఖత్వం! పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు! నీకు, నాకు మధ్య నక్కకీ, నాగలోకానికీ మధ్య ఉన్నంత తేడా ఉంది! మైండిట్!" అనేసి కారులో కూర్చుని "డ్రైవర్! పోనియ్!" అంది.

అంతే! శ్రీనివాస నిశ్చేష్టుడైపోయాడు. అతని ముందు ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టుగా ఉంది. 'తను చెప్పాలనుకున్న దేమిటి? ఆమె అన్న దేమిటి?

ఒక పూట తిండి-మరో పూట పస్తు...చిరిగిన బట్టలు...అతుకుల బొంతలు...స్కాలర్‌షిప్స్ పేరిట వచ్చే డబ్బు ఇంటి ఖర్చులకు బలి...పుస్తకాలు కొనుక్కోవటానికి, ఫీజులు కట్టటానికి డబ్బు లేని పరిస్థితి! ఈ చదువు కొనసాగించటం గగనమైపోతోంది. త నీ చదువు మానెయ్యాలి! ఏదైనా ఉద్యోగం సంపాదించి ఇంట్లోవాళ్ళకి కడుపు నిండా ఇంత కూడు పెట్టాలి! సుహాసిని తండ్రికి ఎన్నో కంపెనీలు ఉన్నాయి. ఫాక్టరీలు ఉన్నాయి. తన పరిస్థితి వివరించాక తండ్రితో చెప్పి ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తుందేమో అని...'

శ్రీనివాస కంటి నిండా కన్నీళ్ళ సుడులు...దెబ్బ తిన్న ఆత్మాభిమానం గంగ, యమునలై ఉప్పొంగుతుంటే, చుట్టూ ఉన్న లోకం అతనికి గజిబిజిగా కనిపిస్తూంది. ✱

